# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 14 సంచిక: 15 | వరంగల్, 14-6-2026, ఆదివారం | పేజీలు: 8 | వెల: 1.00


## 25% రిజర్వేషన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు

అచ్చంపేట 25% రిజర్వేషన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు.. పేద విద్యార్థుల రాజ్యాంగ బద్ధ హక్కు అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు మాదిగ అన్నారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బడులు ప్రారంభం కానున్నాయి.




## భారీ వర్ష సూచన.. 'CURE' పరిధిలో హై అలర్ట్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 13: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ , హైడ్రా , విద్యుత్ శాఖ , వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు.

ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ , డీజీపీ , స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు.. 335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి



మంచిర్యాల, జూన్ 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఇవాళ కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు వితల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి కేసు లేదు: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

హైదరాబాద్, జూన్ 13: మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు.

గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు.

ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.

మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు.

ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు




హైదరాబాద్, జూన్ 13: పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు.

కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

## వారం రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ..




భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఫ్రాన్స్, స్లోవేకియాల వారం రోజుల పర్యటనకు శనివారం బయలుదేరారు. అక్కడ ఆయన జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడం సహా పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. భారతదేశ వ్యూహాత్మక దార్శనికతలో ఫ్రాన్స్‌ను ఓ కీలక భాగస్వామిగా అభివర్ణించారు. ఈ ఏడాది ఆరంభంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఉన్నతీకరించినప్పటి నుంచి సాధించిన పురోగతిని సమీక్షించడంపై.. తాను ఇమ్మానుయేల్ మెక్రాన్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు. ఈ భేటీలో ఇరు దేశాధినేతలు పలు ప్రధాన ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపైనా చర్చించే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ఠ స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటీఊల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి. డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా? నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా?కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి?తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# ఏపీలో 6, తెలంగాణలో 4..

## మూడు ముక్కలుగా లోక్‌సభ నియోజకవర్గాలు

విజయవాడ, జూన్ 13,

దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశానికి సంబంధించి కీలక ప్రతిపాదనలతో సిఫార్సులు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 824 నియోజకవర్గాలకు పెంచాలని పేర్కొంది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలలోని 59 స్థానాలను రెండుగా, 111 స్థానాలను మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సూచించింది. నియోజకవర్గాల విభజనకు.. గత ఎన్నికల్లో పోలింగ్ శాతంతో పాటుగా పట్టణ, ఎస్సీ, ఎస్టీ, మహిళల జనాభా సహా పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచనలు చేసింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు నియోజకవర్గాలు మూడుగా, రెండుగా విభజించాలని సూచించింది.ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల నియోజకవర్గాలను మూడుగా, మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండుగా చేయాలని సూచించింది. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కా?జ్‌గిరి, మెదక్‌లను మూడుగా, చేవెళ్లను రెండుగా విభజించాలని సిఫార్సు చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాలను విభజన వల్ల 2.32% ఓటింగ్ పెరుగుతుందని.. 2.23 కోట్ల మంది అదనంగా ఓటేస్తారని చెబుతున్నారు. తాజా సిఫార్సుల్ని బట్టి నియోజకవర్గాలను విభజిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 3.52%, తెలంగాణలో 6.55% ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. జనాభా, పట్టణీకరణ, ఎస్సీ జనాభా, ఎస్టీ జనాభా, భాషాపరమైన పోలరైజేషన్, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మూడుగా విభజించే లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆరు నగరాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నియోజకవర్గం భాషాపరమైన పోలరైజేషన్ స్కోర్ 0.12 ఉంది. హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉర్దూ మాట్లాడేవారు 10.66 లక్షలమంది ఉన్నారు.. తెలుగు మాట్లాడేవారు 28శాతం, హిందీ మాట్లాడేవారు 5.15శాతం ఉన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని సిఫార్సు చేసింది. ఇలా భాషాపరమైన పోలరైజేషన్ ఉన్నచోట్ల ఓటింగ్ శాతం 11 నుంచి 13 శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.. ఇక సికింద్రాబాద్‌లో పోలరైజేషన్ స్కోర్ (0.120)గా ఉంది. హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే.. ప్రతి నియోజకవర్గంలో 27.87 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్‌ను మూడుగా విభజిస్తే 26.93 పర్సంటేజ్ పాయింట్లు వస్తాయని భావిస్తున్నారు.ఏపీ విషయానికి వస్తే.. నంద్యాల (0.117), రాజంపేట (0.114), కడప (0.105), విశాఖపట్నం (0.052) పోలరైజేషన్ ఉంది. విశాఖపట్నం నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే 15.88 పర్సంటేజ్ పాయింట్లు, కడప నియోజకవర్గం విభజనతో 15.39 పర్సంటేజ్ పాయింట్లు, రాజంపేట 14.47 పర్సంటేజ్ పాయింట్లు, నంద్యాల 14.22 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల ప్రకారం పెద్ద రాష్ట్రాల్లో సీట్లు 50శాతం పెరగనున్నాయి. చిన్న రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను నేరుగా రెట్టింపు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ లోక్ సభ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయి. అన్ని నియోజకవర్గాలను కాకుండా170 నియోజకవర్గాలను విభజిస్తే సరిపోతుందని సిఫార్సు చేశారు. అందుకే 59 నియోజకవర్గాలను రెండుగా.. 111 నియోజకవర్గాలను 3గా చేయాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు.

# అగ్రికల్చర్ లో హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

అనంతపురం, జూన్ 13,

ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్‌మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ - గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

# రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

తిరుపతి, జూన్ 13,

మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది.

కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడుగా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది.

విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతథంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతథంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# డేటా సెంటర్లు...

## 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

విశాఖపట్టణం, జూన్ 13,

ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు.

విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036-37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఫీల్ గుడ్ సరే...వీటి సంగతేంటీ...

విజయవాడ, జూన్ 13,

అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతుంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. వారి వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇలా చేసి వైసిపి ప్రజల నుంచి ఎలాంటి ఫలితాన్ని ఎదుర్కొన్నదో అందరూ చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అటువంటి పరిస్థితి రాకూడదంటే నేతలు జాగ్రత్తగా ఉండడం చాలా మంచిది

# జగన్ కు పాజిటివ్ గా మారుతోందా..

విజయవాడ, జూన్ 13



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నికల ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులకు సంబంధించి కీలక హామీలను ప్రకటిస్తారని, అందుకే జగన్ అన్ని లెక్కలు వేసుకునిఈసారి తనదే అధికారమన్న ధీమాలో ఉన్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

# నయా స్ట్రాటజీతో జనసేనాని

విజయవాడ, జూన్ 13



జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరోకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. తమిళనాడులో విజయ్ కు యువత, మహిళలు ఎక్కువగా కనెక్ట్ కావడంతోనే పార్టీ పెట్టిన ఏడాదిన్నరకే అధికారంలోకి వచ్చారు. అలాంటిది ప్రయత్నిస్తే తాను ఎందుకు కాలేనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అందుకే ఆయన సొంత సామాజికవర్గాన్ని కూడా దూరం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్న టాక్ జనసేన వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ యువతను ఎంత మేరకు ఆకట్టుకుంటారన్నది భవిష్యత్ లో తేలనున్నప్పటికీ ఆయన ఆలోచన మాత్రం విభిన్నంగా సాగుతుందనే చెప్పాలి.

# 59 నియోజకవర్గాలు రెండు భాగాలు

## 111 నియోజకవర్గాలు మూడు భాగాలు
## సౌత్ లో పెరగనున్న 170 స్థానాలు

హైదరాబాద్, జూన్ 14,

దక్షిణాది రాష్ట్రాలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ గుడ్ న్యూస్ చెప్పారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు దక్షిణాది మీద అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కెసిఆర్ నుంచి మొదలు పెడితే రేవంత్ రెడ్డి వరకు దక్షిణాది రాష్ట్రాలను నరేంద్ర మోదీ పట్టించుకోవడంలేదని.. పార్లమెంటు స్థానాల పెంపు విషయంలో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై బీజేపీ సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పుడు బిజెపి తీసుకొచ్చిన ప్లాన్ ఆ తరహా నాయకుల నోర్లు మూసే విధంగా ఉంది.గతంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం తేలిపోయింది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపకపోవడంతో ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు అంచనాలకు మించిన బలాన్ని సొంతం చేసుకున్న తర్వాత కేంద్రం మరొకసారి డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తీసుకొస్తుంది. మన దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పెంచాలని కేంద్రం భావిస్తున్నది. దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవంతమైన పరిపాలన లభిస్తుందని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే పార్లమెంటు స్థానాల పెంపు విషయాన్ని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది. కీలకమైన ప్రతిపాదనలను అందించిందిజనాభా పెరిగినప్పుడు ఖచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన సాధ్యమవుతుంది.నియోజకవర్గాల పెంపునకు పెరిగిన జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుత జనాభా నివేదికలో పట్టణీకరణ.. ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. దీనివల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు పరిపాలన మరింత చేరువవుతుందని.. ఆ ప్రజలకు ప్రతినిధులుగా ఎంపీలు ఉంటారని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది..ఇక దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. కొత్త ప్రతిపాదనలను కేంద్రం అమలు చేస్తే వాటి సంఖ్య 824కు చేరుకునే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాలలో సీట్ల పెంపు ఏకంగా 50% వరకు ఉంటుంది. చిన్న రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న స్థానాలను రెట్టింపు చేస్తారని సమాచారం. దీనివల్ల ఎంపీలు ప్రజలకు మరింత చేరువగా ఉంటారని తెలుస్తోంది.. ప్రధాని ఆర్థిక మండలి నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 170 పార్లమెంట్ నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. ఇందులో 59 నియోజకవర్గాలు రెండు భాగాలవుతాయి. 111 నియోజకవర్గాలు మూడు భాగాలవుతాయి. దీనివల్ల ప్రజలకు ఎంపీలు మరింత దగ్గరవుతారు. సమస్యలను నేరుగా పరిష్కరిస్తారు.నరేంద్ర మోదీ దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో అదిరిపోయే కానుక ఇచ్చే అవకాశం ఉంది. కేరళ రాష్ట్రంలో ప్రస్తుతం 20 స్థానాలు ఉండగా.. అవి 30 కి పెరుగుతాయి. తమిళనాడులో 39 నుంచి 59.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇక మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలు 120కి పెరిగే అవకాశం ఉంది. అక్కడ దాదాపు 80 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజల ప్రాతినిధ్యం మెరుగుపడుతుంది. అంతేకాదు ఓటింగ్ కూడా 2.3 శాతం వరకు పెరుగుతుంది. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2027 జనాభా లెక్కల తర్వాతనే చేపట్టాలని కమిటీ ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన పూర్తయితే దేశంలో రాజకీయంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.c

# ఆయిల్ సంక్షోభానికి చెక్..

న్యూఢిల్లీ, జూన్ 14,

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు.. హర్మూజ్ ఎప్పుడు తెరుచుకుంటుందో అర్థం కావడం లేదు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా దిగుమతిపై ఆధారపడిన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు యూరోపియన్ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే చమురు ధరలు భారీగా పెరిగాయి. భారత్‌లో గ్యాస్, చమురు ధరలను కేంద్రం పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా దేశంలో చమురు సంక్షోభాన్ని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని 50 శాతం పెంచబోతోంది. ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉండగా, వాటిని 90 రోజుల వరకు పెంచే దిశగా అడుగులేస్తోంది. ఆయిల్ కంపెనీలను ఫ్యూయల్ కెపాసిటీని పెంచుకోవాలని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది.దేశంలోని మొత్తం ఇంధన అవసరాల్లో సుమారు 90 శాతం విదేశాల నుంచి దిగుమతుల ద్వారానే తీరుతోంది. పశ్చిమాసియా ప్రాంతం నుంచి ఎక్కువగా చమురు వస్తోంది. ఆ ప్రాంతంలో ఏర్పడిన సంక్షోభం వల్ల సరఫరా చైన్ దెబ్బతిన్నది. అలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, రవాణా రంగం, పరిశ్రమలు దెబ్బతినకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన నిల్వలను పెంచడం అనేది కేవలం నిల్వల సామర్థ్యం పెంచడం మాత్రమే కాదు. ఇది దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అలాంటి సమయంలో దేశంలో తగినంత నిల్వలు ఉంటే, ధరలు ఎక్కువగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే రవాణా రంగం, వ్యవసాయం, పరిశ్రమలు అంతరాయం లేకుండా కొనసాగవచ్చు. దీర్ఘకాలికంగా చూస్తే ఈ చర్య ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది. అయితే నిల్వలు పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిల్వ ట్యాంకులు భారీగా ఉంటాయి. ఆయిల్ కంపెనీలపై ఈ భారాన్ని ఎలా పంచాలనేది కూడా ముఖ్యమైన అంశం.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పుడు చమురు సరఫరా ఎప్పుడైనా ప్రభావితం కావచ్చు. భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది పెద్ద సవాల్. అందుకే ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు పెంచి, సంక్షోభం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చర్య ద్వారా దేశం ఆకస్మిక సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతపై దృష్టి పెట్టిన ఇతర దేశాలతో సమానంగా భారతదేశం కూడా అడుగులేస్తోంది. దీర్ఘకాలంలో ఇంధన వైవిధ్యీకరణవైపు కూడా అడుగులేయడం మరింత మంచిదని నిపుణుల అభిప్రాయం.పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన నిల్వలను 50 శాతం పెంచే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ఇంధన భద్రతకు ముఖ్యమైన అడుగు. 60 రోజుల నుంచి 90 రోజులకు నిల్వలు పెంచడం ద్వారా ఆకస్మిక సరఫరా అంతరాయాలను ఎదుర్కోవచ్చు. ఈ చర్య ఆర్థిక స్థిరత్వం, ధరల నియంత్రణ మరియు దేశ భద్రతకు దోహదపడుతుంది.

# తిరుమలలో భక్తుల రద్దీ

ఈరోజు తిరుమలలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. సర్వదర్శనం కోసం వేచి ఉండే సమయం సుమారు 15?18 గంటల సమయం పడుతుంది కొన్ని రష్ రోజుల్లో ఇది 20?24 గంటలు కూడా దాటుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అనేక కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఇటీవల ఇఊ విడుదల చేసిన వివరాల ప్రకారం కొన్ని రోజుల్లో 21 నుంచి 31 వరకు కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిన పరిస్థితి గత వారం రోజుల్లో రోజుకు 83 వేల నుంచి 93 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారుజూన్ 7న ఒక్కరోజే 93,230 మంది దర్శనం చేసుకోవడం విశేషం సర్వదర్శనం క్యూ లైన్ శిలాతోరణం ప్రాంతం వరకు విస్తరించిన దీంతో భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి కూడా రద్దీ ప్రభావం కనిపిస్తోంది. సాధారణంగా 2?4 గంటల్లో పూర్తయ్యే దర్శనం కొన్ని సమయాల్లో మరింత ఆలస్యం అవుతోంది.కాలినడకన వచ్చే దివ్యదర్శనం భక్తులకు కూడా 6 గంటలకుపైగా నిరీక్షణ తప్పడం లేదు రద్దీ నియంత్రణ కోసం ఇఊ ఎఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను వినియోగిస్తున్నారు దీని వల్ల గతంలో 24?36 గంటలు పట్టిన దర్శనం, ఇప్పుడు పీక్ రష్‌లో కూడా 8?14 గంటల పరిధిలోకి తగ్గిందని అధికారులు చెబుతున్నారు

## జిమ్ లో మహిళా పైలట్ కు వేధింపులు.. కేసు నమోదు

హైదరాబాద్సనత్ నగర్ లో వున్న కల్ట్ జిమ్ ఫిట్నెస్ మేనేజర్ సంతోష్ గౌడ్ పై మహిళా పైలెట్ ఫిర్యాదు చేసింది. జిమ్ ట్రైనింగ్ పేరుతో పైలెట్ ను లోబర్చుకునే ప్రయత్నం ట్రైనర్ సంతోష్ గౌడ్ చేసాడు. ఒక రాత్రి తనతో గడపాలని పైలెట్ పై ఒత్తిడి చేసాడు. ఈ విషయంలో సంతోష్ గర్ల్ ఫ్రెండ్ రజినీ కుడా అతడికి సహకరించింది. ఇద్దరితో ఒకేసారి ప్రైవేటు గా కలిసి ఉండటం సంతోష్ ఫాంటసీ అని పైలెట్ కు వేధింపులకు గురి చేసారు.

# 97 శాతం తగ్గిన మొబైల్ డేటా చార్జీలు

హైదరాబాద్, జూన్ 14,

పెట్రోల్ ధరలు పెరిగాయని, డీజిల్ ధరలు పెరిగాయిని, గ్యాస్ ధరలు పెరిగాయని, కంరెటు చార్జీలు పెరిగాయని, బస్సు చార్జీలు పెరిగాయని వామపక్ష పార్టీలు, విపక్షాలు ఆందోళనలు చేయడం సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రో, గ్యాస్ ధరలపైనే విపక్షాలు ఎక్కువగా ఆందోళన చేశాయి. అయితే ధరలు తగ్గినప్పుడు మాత్రం ఎవరూ స్వాగతించరు. అయితే రోజురోజుకు అన్నింటి ధరలు పెరుగుతున్నాయి. కానీ 12 ఏళ్లలో అనూహ్యంగా ఒకదాని ధర 97 శాతం తగ్గింది. అందరికీ అందుబాటులోకి వచ్చింది. అందే మొబైల్ డేటా.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రంగంలో సాధించిన అపూర్వ విజయాన్ని వెల్లడించింది. 2014లో 1 గిగాబైట్(జీబీ) డేటా ధర రూ.269 ఉంటే, ప్రస్తుతం అది కేవలం రూ.9.2కి తగ్గింది. అంటే గత 4,399 రోజుల్లో (సుమారు 12 ఏళ్లలో) డేటా ధరలో 97 శాతం తగ్గుదల నమోదైంది.ఇది భారత్ డిజిటల్ చరిత్రలో ఒక మైలురాయి. ఈ అద్భుత మార్పు వెనుక కేంద్ర ప్రభుత్వం నిరంతరం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, భారత్‌నెట్ ప్రాజెక్ట్, ఆప్టికల్ ఫైబర్ విస్తరణ, పోటీతత్వం ప్రోత్సాహం, 2016లో రిలయన్స్ జియో ప్రవేశం వంటి అనేక అంశాలు కలిసి ఈ ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడం, స్పెక్ట్రం అలాట్‌మెంట్‌లో పారదర్శకత, 5జీ సేవల వేగవంతమైన రోల్‌అవుట్ వంటి చర్యలు డేటా సరఫరాను భారీగా పెంచి, ధరలను తగ్గించాయి.ఈ చౌక డేటా ధరల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది సామాన్యులు, విద్యార్థులు, రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, గ్రామీణ యువతకు అధునాతన ఇంటర్నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. విద్యా రంగంలో ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ లెర్నింగ్ఆరోగ్య రంగంలో టెలి మెడిసిన్ సేవలు, ఆర్థిక రంగంలో యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, చిన్న వ్యాపారాలు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్‌ను చేరుకోవడానికి చౌక డేటా ధరలు ప్రధాన ఆధారం అయ్యాయి.ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత చౌకైన డేటా ధరలు కలిగిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. నాణ్యతతోపాటు చౌకదనం కలిపి ఇంటర్నెట్‌ను సామాన్యుని జేబులోకి తీసుకువచ్చిన దేశంగా భారత్ ప్రపంచం ముందు నిలుస్తోంది. మోదీ పాలనలో డేటా ధరల్లో వచ్చిన ఈ భారీ తగ్గుదల కోట్లాది భారతీయుల జీవన విధానాన్ని, అవకాశాలను మార్చిన నిజమైన డిజిటల్ విప్లవం. చౌకైన, నాణ్యమైన ఇంటర్నెట్ దేశంలోని చివరి వ్యక్తి వరకు అందుబాటులోకి వచ్చిన ఈ ప్రయాణం భారత్‌ను ప్రపంచ డిజిటల్ శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

# 25న రానున్న లెనిన్...

హైదరాబాద్, జూన్ 14,

ఏజెంట్' వంటి భారీ డిజాస్టర్ ఫ్లాప్ తర్వాత , బాగా గ్యాప్ తీసుకున్న అఖిల్, 'లెనిన్' చిత్రం తో ఈ నెల 25 న మన ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా పై అక్కినేని ఫ్యాన్స్ లో బోలెడన్ని ఆశలు ఉన్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు విడుదల చేసిన ప్రతీ కంటెంట్ చాలా ప్రామిసింగ్ గా అనిపిస్తున్నాయి. అంతే కాకుండా అఖిల్ ఈ చిత్రం లో చాలా అద్భుతంగా నటించాడని , ముఖ్యంగా సెకండ్ హాఫ్ అదిరిపోయిందని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. మొత్తానికి అఖిల్ ఈ సినిమాతో మొట్టమొదటి బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకోబోతున్నాడని, ఇక్కడి నుండి ఆయన వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే ఉండదని అంటున్నారు. అలాంటి సినిమా ఇప్పటికే ఒకసారి వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి వాయిదా పడింది అంటూ వార్తలు వినిపిస్తున్నాయి.ముందుగా ఈ చిత్రాన్ని మే డే సందర్భంగా 'మే 1' న విడుదల చేద్దామని అనుకున్నారు. కానీ ఏప్రిల్ 30 న 'పెద్ది' చిత్రం విడుదల కాబోతుందని అప్పటికే ఆ చిత్ర మేకర్స్ అధికారిక ప్రకటన చేయడం తో , అఖిల్ కి రామ్ చరణ్ తో ఉన్నటువంటి అనుబంధానికి విలువ ని ఇస్తూ, మా 'లెనిన్' చిత్రాన్ని జూన్ 25 కి వాయిదా వేస్తున్నట్టు చెప్పుకొచ్చారు నిర్మాతలు. కానీ అసలు నిజం అది కాదు, సినిమా ఇంకా పూర్తి కాకపోవడం వల్లే వాయిదా పడిందని ఇప్పుడు అర్థం అవుతోంది. ట్రేడ్ నుండి అందుతున్న సమాచారం ఏమిటంటే ఈ సినిమా జూన్ 25 న కూడా విడుదల కావడం లేదట. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ బాగా సమయం తీసుకుంటుందని , కొన్ని ఎఈచీ షాట్స్ డెలివరీ అవ్వాల్సిన అవసరం ఉందని , ఇప్పటి వరకు అవి డెలివరీ అవ్వలేదని అంటున్నారు.అంతే కాకుండా ఎడిటింగ్ వర్క్ కూడా ఇంకా పూర్తి అవ్వలేదట. కేవలం ఫస్ట్ హాఫ్ ని మాత్రమే ఇప్పటి వరకు లాక్ చేసినట్టు సమాచారం. రీ రికార్డింగ్ వర్క్ కూడా చాలా వరకు బ్యాలన్స్ ఉందట. అందుకే ఈ చిత్రాన్ని జులై కి వాయిదా వేస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనలో ఉన్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత నాగవంశీ సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తుండగా , అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ కూడా నిర్మాణం లో భాగం పంచుకుంది. ముందుగా ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం శ్రీలీల ని తీసుకున్నారు. కానీ ఆమె తప్పుకోవడం తో , ఆమె స్థానంలోకి భాగ్యశ్రీ ని తీసుకున్నారు. ఈ చిత్రం లో అఖిల్ గుడ్డివాడిగా నటించబోతున్నాడని టాక్.



# హస్తినకు రాములమ్మ...

హైదరాబాద్, జూన్ 13

తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ ను కలసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు.

## ఆగని అంతర్గత పోరు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి నివేదికలను అందిస్తున్నారన్న అనుమానం ఇక్కడి నేతలకు ఉంది.మీనాక్షి నటరాజన్ పార్టీ ఇన్ ఛార్జిగా పదవి బాధ్యతలను తీసుకున్న తర్వాత తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీలో శత్రువులు పెరిగారన్నది అంతే వాస్తవం. మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు సయితం నామినేషన్ తిరస్కారానికి గురైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలకు సమాచారం ఇచ్చేందవరు? అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ లో పోస్టుమార్టం జరుగుతుంది. కానీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తెలంగాణ కాంగ్రెస్ నుంచి ఎవరూ సమాచారం ఇవ్వలేదని, కేవలం తెలంగాణ బీజేపే నేతలు ఇచ్చిన సమాచారంతోనే వారు ఫిర్యాదు చేశారంటున్నారు. మొత్తం మీద మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

# ఇకపై డిజిటల్ పౌర సేవల కేంద్రాలుగా సహకార సంఘాలు

నల్గోండ, జూన్ 13,

గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక చిన్న సర్టిఫికేట్ కోసమో, పాస్‌పోర్ట్ దరఖాస్తు కోసమో పట్టణాల్లోని మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే రోజులకు త్వరలోనే తెరపడనుంది. గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలనే ఇకపై మల్టీ సర్వీస్ డిజిటల్ హబ్‌లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ చొరవతో, నాబార్డు సమన్వయంతో రూపుదిద్దుకుంటున్న ఈ సరికొత్త కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా.. ఆధార్, పాన్ కార్డు సేవలతో పాటు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు సేవలను రైతుల వద్దకే తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న డిజిటల్ పని కోసమైనా, ప్రభుత్వ సేవలను పొందాలన్నా మండల కేంద్రాలకో లేదా పట్టణాలకో పరుగులు తీసే రోజులు త్వరలోనే కానరాకుండా పోనున్నాయి. ఇకపై మీ గ్రామంలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారానే సమస్త డిజిటల్ పౌర సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ సంఘాలన్నింటినీ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాలు అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడానికే పరిమితం అనే భావన ఉంది. అయితే వీటికి పూర్తిస్థాయిలో డిజిటల్ హంగులు అద్ది, డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన అన్ని రకాల సామాజిక, సంక్షేమ, విద్యా, ఆరోగ్య సేవలను ఒకే చోట అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డుల మధ్య జాతీయ స్థాయిలో కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సరికొత్త డిజిటల్ విప్లవం ద్వారా పీఏసీఎస్‌లు కేవలం వ్యవసాయ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే డిజిటల్ హబ్‌లుగా రూపాంతరం చెందనున్నాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని ఈ ఏడాది ఆఖరు నాటికి వంద శాతం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే తొలి విడతగా రాబోయే ఆగస్టు 15వ తేదీ నాటికి 562 సంఘాల్లో సేవలను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మద్దతుతో లైసెన్సులు, ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే 15 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. అలాగే డిజిటల్ సేవలతో పాటుగా ప్రభుత్వ, వ్యాపార విభాగాలు కూడా ఇక్కడే కొలువుదీరనున్నాయి.అయితే ఈ కామన్ సర్వీస్ సెంటర్లలో ఆధార్ కార్డు అప్‌డేట్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఓటరు గుర్తింపు కార్డులు, జనన మరణాల నమోదు చేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్ష కార్డులు, డెయిరీ, మత్స్య పరిశ్రమ సేవలు, రేషన్, గోదాముల నిర్వహణ వంటి సేవలను కూడా అందిస్తారు. అలాగే జీవన్ ప్రమాణ్ పత్రాలు, శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఐటీ రిటర్నుల దాఖలు, జీవిత బీమా, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపులు, వాహన్, ఈ చలాన్, ఈ స్టాంపుల జారీ, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ సదుపాయం కూడా ఇక్కడ లభిస్తుంది.వీటన్నింటితో పాటు భవిష్యత్తులో ఈ సహకార సంఘాలను జన ఔషధి కేంద్రాలుగా మార్చి.. రాయితీ ధరలపై నాణ్యమైన ఔషధాలను విక్రయించడానికి కూడా ప్రత్యేక లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ చొరవతో గ్రామీణ ప్రజల సమయం, డబ్బు భారీగా ఆదా కానున్నాయి.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్ జూన్ 13,

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల అక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

# ఖమ్మంలో గాయత్రీ రవి టార్గెట్

ఖమ్మం, జూన్ 13,

ఖమ్మం జిల్లాలో విజిలెన్స్ దాడులు కలకలం రేపుతున్నాయి. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవికి చెందిన కంపెనీల మీదే వరుసబెట్టి జరుగుతుండటం పొలిటికల్ హాట్ అవుతోంది. ఇదంతా నిజంగానే అక్రమాల వెలికితీత కోసం జరుగుతోందా?? లేక రాజకీయ కక్ష సాధింపులో భాగమా అన్న అనుమానాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయట. వరంగల్ జిల్లాకు చెందిన వద్దిరాజు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ వ్యాపారం ఉంది. బీసీ కాపు సామాజిక వర్గానికి చెందిన రవిమొదట్లో కాంగ్రెస్ అభిమానిగానే ఉన్నారు. 2018లో ఆ పార్టీ వరంగల్ తూర్పు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చిందిగానీ విజయం సాధించలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాక రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు కేసీఆర్. ఆ పదవీకాలం రెండేళ్ళే కావడం, ముగిసిపోవడంతో తిరిగి ఆయనకే రెన్యువల్ చేశారు. ఈ పరిస్థితుల్లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో వద్దిరాజును తమ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని అనుకున్నారట కాంగ్రెస్‌లోని కొందరు. అందుకు ఆయన ఒప్పుకోకపోగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారన్న కోపంతో అధికార పార్టీ ఇప్పుడు టార్గెట్ చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి పొలిటికల్ సర్కిల్స్‌లో. కేసీఆర్, హరీష్‌రావు లాంటి అగ్ర నాయకులకు దగ్గరగా ఉండే గాయత్రి రవిని బీఆర్ఎస్‌కు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే కొద్ది రోజులుగా ఆయనకు చెందిన గ్రానైట్ కంపెనీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇవి ఎక్కడా బయటికి ఎక్స్‌పోజ్ అవకుండా జాగ్రత్త పడ్డారట అధికారులు. మరోవైపు కొంతకాలంగా? ఖమ్మం జిల్లా కారును గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల, సండ్ర వెంకటవీరయ్య కలిసి నడిపిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్నందునే గాయత్రి రవి టార్గెట్ అయ్యారా అన్న అనుమానాలు కూడా చాలామందికి ఉన్నాయట. జిల్లాలో ఉన్న ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని టార్గెట్ చేసేలా అధికార పార్టీ పావులు కదుపుతోందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. అటు గతంలో కాంగ్రెస్ నేతలకు అత్యంత ఆప్తుడిగా ఉండేవారు రవి. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఒక మినిస్టర్‌కు అప్పట్లో రైట్ హ్యాండ్‌లా ఉండేవారాయన. ఇప్పుడు తనకు ఎదురవుతున్న సమస్యలు, వేధింపుల గురించి వద్దిరాజు రవిచంద్ర సదరు మంత్రికి చెప్పుకున్నా నా చేతిలో ఏమీ లేదని ఆయన అన్నట్టు తెలిసింది. మరోవైపు వచ్చే అసెంబ్లీ? ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యే సీట్లో రవి పోటీ చేస్తారన్న ప్రచారం సైతం ఉంది. ఇక ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బంధువులు నిర్వహిస్తున్న దుకాణ సముదాయానికి కూడా అధికారులు నోటీసులు ఇచ్చారట. వాటి వెనుక సైతం అధికార పార్టీ నేతల వత్తిడి ఉందని ఆఫ్ ద రికార్డ్‌లో అజయ్ అంటున్నారట. అయితే దాన్ని ఇష్యూ చేయడం వల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ ఉండదన్నది ఆయన అభిప్రాయం. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా పాలిటిక్స్‌లో అజయ్ వర్సెస్ గాయత్రి రవి అన్నట్టుగా కూడా వ్యవహారాలు నడిచాయి. ఆ సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం నడుస్తున్న విజిలెన్స్ వ్యవహారాలను గాయత్రి రవి ఎలా ఎదుర్కొంటారోనని చూస్తున్నాయి రాజకీయవర్గాలు.

# పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్

## 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్

హైదరాబాద్ జూన్ 13,

హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం 'జ' (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది. సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు. హైదరాబాద్-విజయవాడ రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్-వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

# బోధన్ లో కనిపించని షకీల్

నిజామాబాద్, జూన్ 13,

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్చార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ? మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్ఎస్ఎక్కడికక్కడ ఇన్చార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్చార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు? పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ? ఇంకోసారి దుబాయ్ ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో? తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్థంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

# ఇన్ యాక్టివ్ గా మారిన బండి

కరీంనగర్ జూన్ 13,

కొడుకు మీద ఫోక్సో కేసు నమోదైన తర్వాత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజకీయంగా అంత యాక్టివ్ గా లేరు. పైగా ఆయన తీవ్ర నిరాశలో కనిపిస్తున్నారు. ఒకప్పటి మాదిరిగా ప్రత్యర్థుల మీద ఆయన ఆగ్రహం గా ఉండడం లేదు. తీవ్రస్థాయిలో మాట్లాడటం లేదు. కార్యకర్తలను కలుస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీ లేదా హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు. అత్యంత సన్నిహితులకు మాత్రమే ఆయన దగ్గరగా ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం బండి సంజయ్ ఆ మాత్రం కూడా అందుబాటులో లేకుండా పోయారు. సన్నిహితులకు కూడా ఆయన సమాచారం తెలియదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కి ఏమైంది.. ఆయన ఏమైపోయారు.. ఉన్నట్టుండి అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లిపోయారు అనే చర్చ నడిచింది. ఇక నమస్తే తెలంగాణ అయితే బండి సంజయ్ మీద టన్నులకొద్దీ బురద కథనాలు రాయడం మొదలుపెట్టింది. అయితే బండి సంజయ్ ఎట్టకేలకు బయటికి వచ్చారు. తాను ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయానో వివరించారు. బండి సంజయ్ అజ్ఞాతంలోకి వెళ్లలేదు. ఎవరికీ కనిపించకుండా పోలేదు. ఆయన అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ పాలు తాగడం వల్ల ఆయన ఆరోగ్యం పాడైంది. దీంతో ఆయన చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. గర్జన 20 సంవత్సరాలుగా బండి సంజయ్ కానీ దగ్గు లేదా జ్వరంతో కూడా బాధపడలేదు. హైదరాబాద్ నగరంలో కల్తీ పాలు తాగడం వల్ల ఐదు రోజులు ఆయన మంచానికే పరిమితమయ్యారు. ఇదే విషయాన్ని ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతు సమ్మేళనంలో వెల్లడించారు. రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని.. ప్రకృతి సిద్ధ మీద దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సేంద్రీయ సాగుతో రైతుల కోటీశ్వరులు కావచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులను ప్రకృతిసిద్ధమైన ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు 10,000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని బండి సంజయ్ అభినందించారు. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం పెరిగిపోయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహిస్తున్న దాడులలో ఈ విషయాలు వెలుగుచూస్తున్నాయి. చివరికి కేంద్రమంత్రి కూడా కల్తీ పాల వల్ల అనారోగ్యానికి గురి కావడం ఆందోళన కలిగిస్తోంది.

# ఓటరు జాబితాలో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ పేరు మాయం

అమేధీ జూన్ 13,

బీజేపీ సినీయర్ నేత, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు ఓటరు జాబితానుంచి మాయమయింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అమేఠీ నుండి 2019లో ఎంపీగా ఎన్నికై, మేదాన్ మావయ్ గ్రామంలో స్మృతి ఇరానీ సొంత ఇల్లు నిర్మించుకుని, అదే పంచాయతీలో ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ అక్కడి నుండే పోటీ చేసినా, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జాబితా నుండి స్మృతి ఇరానీ పేరు మాయమయింది. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు అమేఠీ జిల్లా మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు.

# హన్మకొండ జిల్లాలో హైడ్రా తరహా కూల్చివేతలు

హన్మకొండ జూన్ 13,

హన్మకొండలో శనివారం ఉదయం హైడ్రా తరహా కూల్చివేతలు కొనసాగాయి. కోర్టు నుండి స్టేటస్ కో ఆర్డర్ ఉన్నా కూడా మున్సిపల్, కుడా అధికారులు కనికరించలేదనా బాధితులు ఆరోపించారు. గతంలో గుడిసెలు కూల్చుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పుడు దగ్గరుండి కూల్చివేతలకు కాంగ్రెస్ నాయకులు సహకరిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. శనివారం, ఆదివారం కోర్టులకు సెలవు కావడంలో కూల్చివేతలకు ప్రణాళికలు వేసారని ఆరోపించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యం చేస్తున్నరని గుడిసెవాసుల ఆవేదన.


# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

## కాకినాడ రూరల్ సర్పవరంలో ఘటన

కాకినాడ జూన్ 13, భర్తను భార్య తన ప్రియుడితో కలిసి హతమార్చిన ఘటన సర్పవరం లో చోటు చేసుకుంది. మార్చి 13న దుర్గాప్రసాద్ మృతి చెందాడు. భర్త గుండెపోటుతో చనిపోయినట్లు భార్య రమాదేవి నమ్మించింది. రమాదేవికి ఇన్స్టాగ్రామ్ లో బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన గోపిసాయి పరిచయమయ్యాడు.

# సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

## సెప్టెంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.



తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.

22న ఆర్జిత సేవా టికెట్ల విడుదలకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదలఅంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి దర్శన కోటా విడుదలశ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా?వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల?తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టినా నిరాశే మిగిలింది

## ఏడు రోజులైనా లభించని చిన్నారి ఆచూకీ

కాకినాడ జూన్ 13, ఏడు రోజుల క్రితం అదృశ్యం అయిన చిన్నారి జ్ఞానేశ్వరి(2) ఆచూకీలో కీలకం అవుతందని అనుకున్న శునకం నిరాశపరిచింది. చిన్నారితో పాటు అదృశ్యమై, తిరిగి ఇంటికి చేరి, అడవుల దిశగా వెళ్లడంతో.. చిన్నారి జాడ కనిపెట్టడంలో హెల్ప్ అవుతుందనుకున్నారు. దాంతో ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టి గాలించగా.. సమీప తోటలు, ప్రధాన రహదారిలో చక్కర్లు కొట్టి.. తిరిగి ఇంటికి చేరుకుంది. తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో యాభై ఎకరాల పామాయిల్ తోట కాపలాదారుడిగా పనిచేస్తూ, అదే తోటలో గణేష్, భవాని దంపతులు వుంటున్నారు. గత శనివారం పెంపుడు కుక్కతో కలిసి ఇంటి నుండి వీరి రెండేళ్ల కూతురు జ్ఞానేశ్వరి(జాను) అడవి వైపు వెళ్ళిపోయింది. అటవీ ప్రాంతంలో వందల మంది పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నా లాభం లేకపోవడంతో కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి గాలింపు చర్యలు చేపట్టరు.

# మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు.

వికారాబాద్ జూన్ 13,

వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ రైతులకు మద్దతుగా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, పోలీసులు రంగాపూర్ చౌరస్తాలో అరెస్ట్ చేసారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇవ్వమని గ్రామ సర్పంచ్, రైతులు అమరణ నిరాహారదీక్షకు దిగారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రైతులను పరామర్శించేందుకు వెళుతుండగా మహేష్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసారు. పోలీసుల తీరుపై అయన మండిపడ్డారు.

# సంగారెడ్డి గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13:

తెలంగాణ గిరిజన సంక్షేమ నివాస డిగ్రీ కళాశాల (బాయ్స్), పెద్దకంజర్లలో 2026--27 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుక్క సునీలా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని ఆధునిక వసతులు ఉచితంగా అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

అందుబాటులో ఉన్న కోర్సులు:

బి.ఎస్‌సి:గణితం, భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్

బి జెడ్ సి: బోటనీ , జువాలజీ రసాయన శాస్త్రం

ఎం ఎస్ డి ఎస్ :గణితం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్

ఎం ఎస్ సి : గణితం, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్

బి .కాం.కంప్యూటర్ అప్లికేషన్స్,బి.కాం (ఆనర్స్)

బి.ఏ ( హెచ్ ఈ పి )

కళాశాల ప్రత్యేకతలు

అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉచిత నాణ్యమైన బోధన,డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యాధునిక ప్రయోగశాలల సౌకర్యం,

ఉచిత వసతి, భోజనం, 24 గంటల భద్రతతో కూడిన నివాస ప్రాంగణం,క్రీడలు, జిమ్ సౌకర్యాలు.పీజీ, క్యాట్, మ్యాట్, జామ్ తదితర ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ,కెరీర్ గైడెన్స్ మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

24 గంటలపాటు అందుబాటులో వైద్య అధికారి సేవలు ఉంటాయని తెలిపారు.

అర్హత

2025 లేదా 2026 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల విద్యార్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్

9912834414/9440887833/

8008070959/ప్రిన్సిపాల్ సుక్క సునీలా మొబైల్: 7702790377 లలో సంప్రదించవచ్చని సూచించారు.

# స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13:



స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సంగారెడ్డిలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మగ్గం శిక్షణ పూర్తి చేసిన శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ పుష్పగుచ్ఛంతో నిర్మల జగ్గారెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శిక్షణార్థులందరూ కరతాళధ్వనులతో ఆమెకు హృదయపూర్వక స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బ్యూటీ పార్లర్ శిక్షణ పొందుతున్న 34 మంది శిక్షణార్థినులు రూపొందించిన బ్రైడల్ మేకప్ ప్రదర్శనను నిర్మల జగ్గారెడ్డి తిలకించి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి గెటప్, భారతమాత గెటప్‌తో పాటు వివిధ సాంప్రదాయ అలంకరణలతో శిక్షణార్థినులు చేసిన ప్రదర్శనలు ఆమెను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ సంస్థ కార్యకలాపాలు, శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఎస్ బి ఐ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో గ్రామీణ యువతకు పూర్తిగా ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని, శిక్షణతో పాటు భోజన, వసతి (హాస్టల్) సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. సంస్థలో శిక్షణ పొందిన వారిలో అధిక శాతం మంది స్వయం ఉపాధి లేదా ఉపాధి అవకాశాలు పొందుతూ జీవితంలో స్థిరపడుతున్నారని వివరించారు.

ఈ విషయాలను తెలుసుకున్న నిర్మల జగ్గారెడ్డి సంస్థ సేవలను ప్రశంసిస్తూ, గ్రామీణ యువత అభివృద్ధికి కృషి చేస్తున్న డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ ని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. "ఆడపిల్ల అబల కాదు... ఆది పరాశక్తి" అని కొనియాడుతూ, ప్రతి మహిళ స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడ అన్యాయం జరిగినా ధైర్యంగా ప్రశ్నించాలని, తమ హక్కుల కోసం నిలబడాలని సూచించారు.

శిక్షణార్థులు ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను మధ్యలో వదిలేయకుండా నిరంతరం సాధన చేస్తూ స్వయం ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సేవలను స్మరించుకుంటూ, ఆమె నాయకత్వం మహిళలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహిళలు తమ ప్రతిభను నమ్ముకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శిక్షణార్థులను ఉత్సాహపరిచారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ నాయక్, సంస్థ కో-ఆర్డినేటర్లు శివశంకర్, నర్సింలు, జేఆర్‌పీ లక్ష్మీప్రియ, దుర్గ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# భైంసా పట్టణంలో ప్రత్యేక ట్రాఫిక్ తనిఖీలు 54 కేసులు నమోదు

## - 16 వాహనాలు స్వాధీనం.
## -భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 13(భారత శక్తి ):



జిల్లా ఎస్పీ డా. జానకి శర్మిల ఆదేశాల మేరకు, భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో భైంసా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ప్రత్యేక ట్రాఫిక్ అమలు కార్యక్రమం, నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృత తనిఖీలు చేపట్టారు.

నాకాబందీ ఏర్పాట్లను అదనపు ఎస్పీ సాయి కిరణ్ ఆకస్మికంగా పరిశీలించి, ట్రాఫిక్ అమలు చర్యలను సమీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన బాలల తల్లిదండ్రులకు చట్టపరమైన పరిణామాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన 5 కేసులు, ట్రిపుల్ రైడింగ్‌కు సంబంధించిన 2 కేసులు, నంబర్ ప్లేట్లు లేని 9 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

స్పాట్ చలాన్ల ద్వారా 26 కేసులు నమోదు చేసి రూ.18,500 జరిమానా వసూలు చేయగా, కెమెరా చలాన్ల ద్వారా 15 కేసుల్లో రూ.3,125 వసూలు చేశారు. మొత్తంగా 54 కేసులు నమోదు చేసి రూ.21,355 జరిమానా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా భైంసా టౌన్ ఎస్‌హెచ్‌వో టి. సాయి కుమార్ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ ధరించాలని, వాహనాలపై చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలోనే జాబ్ ఫ్రాడ్ పేరుతో మోసం చేసిన మహిళ అరెస్ట్.

## -గతంలో ప్రధాన నిందితులు ముగ్గురి అరెస్ట్
## -అనంత ఈ సొల్యూషన్, విద్యాదాన్ ఎన్జీవో ఆర్గనైజేషన్ పేరుతో నకిలీ జాబ్ ఫ్రాడ్స్
## -ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళపై 20 కేసులు నమోదు.
## -ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి, పోలీసులకు సమాచారం అందించాలి.
## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 13(భారత శక్తి) ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఏజెంట్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వందల మంది అభ్యర్థులను మోసం చేసిన ముఠా సభ్యులలో ఒకరైన సుజాత ఠాకూర్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ముఠా సభ్యులపై 20 కేసులకు పైగా నమోదు అయినట్లు తెలిపారు. ఈ ముఠా లోని ప్రధాన నిందితులను ఈ సంవత్సరం జనవరి 10న అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని, మిగిలిన నిందితులలో ఒకరైన సుజాత ఠాకూర్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిందితులు 2023 సంవత్సరంలో అనంత ఈ సొల్యూషన్స్ మరియు విద్యాదాన్ ఆర్గనైజేషన్ అనే సొసైటీ ద్వారా విద్యాంజలి 2.0 స్కీం డబ్బులు దుర్వినియోగం చేయాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సి ఎస్ ఆర్ నిధులు కాజేయాలని దురుద్దేశంతో ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని అబద్ధాలు చెప్పి నిరుద్యోగులను నమ్మబలికి నకిలీ ఉద్యోగాలను వివిధ పాఠశాలల్లో మరియు కళాశాలలో వచ్చేలా చేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. ఈ ముఠా సభ్యులు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఒక్కొక్కరి వద్ద లక్ష నుండి రెండున్నర లక్షల వరకు వసూలు చేసి దాదాపు 240 అభ్యర్థులను మోసం చేయడం జరిగిందని తెలిపారు. ఈ ముఠా సభ్యులకు ఏజెంట్లుగా ఉన్నటువంటి ఆదిలాబాద్ జిల్లాలో సహకరించినటువంటి వారిపై ఇదివరకే పలు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ప్రజల ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి మాటలను నమ్మవద్దని అప్రమత్తంగా వ్యవహరించాలని డబ్బులతో ప్రభుత్వ ఉద్యోగాలు రావని పరీక్షల ద్వారా ఉద్యోగాలను సాధించాలని తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసే వారిపై, ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, నిందితులను ఎట్టి పరిస్థితులను విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు.

# రాజీతో రాజా మార్గం : ఎస్సై బి. చంద్రశేఖర్

ములుగు జిల్లా ప్రతినిధి,జూన్ 13(భారత శక్తి): జిల్లా కోర్ట్ జాతీయ లోక్ ఆధాలాత్ రాజీతో రాజా మార్గాన్ని ఎంచుకోవచ్చని ములుగు ఎస్సై చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా కోర్టులో ఈనెల 10 నుండి 20 వరకు లోకదాలత్ నిర్వహించడం జరుగుతుందని,

ఇందులో భాగంగా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కోర్టు కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమ మైన రాజా మార్గమని, దీని ద్వారా సమయం వృధా కాకుండా సత్వర న్యాయం కాక్షిదారులకు ఇరువైపులా జరుగుతుందని పేర్కొన్నారు. ములుగు పోలీస్ స్టేషన్ పరుధిలోని కక్షిదారులు నేరుగా పోలీస్ స్టేషన్ ను సంప్రదించవచ్చని, లేదా8712670081, 8712670082 గల మొబైల్ నెంబర్ ల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.



# అటవీ పరిశుభ్రత కార్యక్రమం విజయవంతం

## -పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కంకణ బదులు కావాలి
## -ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
## -నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్

నర్సాపూర్, జూన్ 13,(భారత శక్తి న్యూస్):



మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో సేవ్ వాటర్, నేచర్ ఫౌండేషన్, గ్లోబల్ స్కూల్, యూత్ ఫర్ సేవ్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం నిర్వహించి అటవీ పరిశుభ్రత కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు,వాకింగ్ క్లబ్ సభ్యులు, సామాజిక సేవకులు, విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అటవీ ప్రాంతాన్ని పరిశుభ్రపరచడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరూ కంకణబద్ధులై ప్రతి చిన్నారి నుండి వృద్ధాప్యం వరకు పుట్టినరోజు సందర్భంగా వారి వారి పరిసరాలలో మొక్కలు నాటాలని తద్వారా మంచి ఆక్సిజన్ ని పొందే అవకాశం ఉందని,పాడి పంటలు బాగా పండాలంటే వర్షాలు కురవడానికి అడవులను సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగితే మానవాళి మనుగడకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, మేఘన ముసునూరి, ఫౌండేషన్ గ్లోబల్ స్కూల్ ప్రతినిధులు, యువకులు, పర్యావరణ ప్రేమికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13:

భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని



గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్‌గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. "జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయింది" అని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# దేశంలో 12 ఏళ్ల మోదీ సుపరిపాలన

## – తెలంగాణలో వచ్చేది బీజేపి ప్రభుత్వమే: మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 14 (భారత శక్తి): భారతదేశంలో నరేంద్ర మోదీ 12 ఏళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుతున్నారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు.

ములుగు జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో శనివారం భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పై బిజెపిములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి కొండేటి శ్రీధర్ మాజీ శాసనసభ్యులు హాజరై మాట్లాడారు.

స్వతంత్రం వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని సంవత్సరాలు పరిపాలించిన దేశంలో అభివృద్ధి జరగలేదని విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కేవలం 12 సంవత్సరాల పాలనలో నరేంద్ర మోడీ భారతదేశాన్ని అభివృద్ధి పరంపర కొనసాగేలా చేశారని కొనియాడారు.

అంతేకాక ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న 370 ఆర్టికల్ రామమందిర నిర్మాణం కామన్ సివిల్ కోడ్ ట్రిపుల్ తలాక్ వంటి ఎన్నో బృహత్తర సమస్యలకు పరిష్కారం లభించింది కేవలం నరేంద్ర మోడీ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం ద్వారానే జరిగిందని అనేక నేషనల్ హైవేస్ విమానాశ్రయాలు బుల్లెట్ ట్రైన్స్ ఆధునీకరణ సామాన్యులకు అందుబాటులో డిజిటల్ పేమెంట్ ద్వారా ప్రపంచంలోనే అగ్రగామిగా భారతదేశాన్ని నిలబెట్టిన నిలబెట్టిన ఘనత మన ప్రియతమ మోడీకే దక్కుతుందని తెలిపారు ప్రపంచ దేశాలు మోడీ ముందు మోకరిల్లుతున్నాయని యుద్ధం సమయంలో భారతీయులను క్షేమంగా తీసుకువచ్చిన ఘనత నా మోడీ గారికే దక్కుతుందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో బిజెపి లేకున్నా కేంద్రం నుండి ఎన్నో నిధులను ఇచ్చి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నరేంద్ర మోడీ దోహదపడ్డారని అన్నారు

ములుగు ఏజెన్సీ ప్రాంతానికి విద్యుల విశ్వవిద్యాలయంతో పాటు ప్రపంచ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి గుర్తింపు అందించడం అభినందనీయమన్నారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఎన్నో అభివృద్ధి పదాలను అందించిన మహా నాయకుడు నరేంద్ర మోడీ అని కొనియాడారు

ముచ్చటగా నాలుగోసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి అధికారం ప్రజలు కట్టనున్నారని దీమా చేశారు ఈ కార్యక్రమంలో



జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య జవహర్లాల్ అజ్మీర కృష్ణవేణి నాయక్ రాష్ట్ర నాయకులు భూక్య రాజు నాయక్ ఉపాధ్యక్షులు జింకల కృష్ణాకర్ రావు అల్లే శోభన్ జిల్లా నాయకులు సూర్యదేవర విశ్వనాథ్ గంగిశెట్టి రాజకుమార్ కన్నోజు సునీల్ కుమార్ దొంతి రెడ్డి రవి రెడ్డి కారుపోతుల యాదగిరి గౌడ్ దండిగా వెంకటేశ్వర్లు పట్టణ అధ్యక్షులు ఉమ్మడి రాకేష్ యాదవ్ మండల అధ్యక్షులు రాయచ నాగరాజు బైకని మహేందర్ పైడ్ ఆకుల మల్లేష్ మమన్ యాదవ్, రవితేజ యాదవ్, పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలి.

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.



అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.

పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఖట్టర్ కు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు.

కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

# హౌసింగ్ అక్రమాలపై ఉక్కుపాదం..!!

## -హౌసింగ్ శాఖ సమీక్ష సమావేశంలో అధికారులకు మంత్రి పార్థసారథి సీరియస్ వార్నింగ్..!
## -సెప్టెంబర్ నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి
## -స్వాహా చేసిన నిధుల రికవరీకి చర్యలు.

ప్రొద్దుటూరు, జూన్ 13(భారత శక్తి ): గతంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు ఆర్‌డబి అతిథి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల పేదలు నష్టపోయారని పేదల కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. జరిగిన ప్రతి అక్రమంపై విచారణ జరిపి స్వాహా చేసిన కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు. మెప్మా మహిళా సంఘాలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్లలో ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న సెప్టెంబర్--అక్టోబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి చేసి లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, "ప్రభుత్వం జీతాలు ఇస్తోంది ప్రజలకు సేవ చేయడానికి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడానికి కాదు. ఇకపై నిర్లక్ష్యం, అలసత్వం అస్సలు సహించం. లక్ష్యాలు చేరుకోలేకపోతే ఉద్యోగాలు వదిలి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తెచ్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ లబ్ధిదారుడు తన ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుందని, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబందిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలి.

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 13 : దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

ఈ 6 మహానగరాల అభివృద్ధి కోసం రూ. 6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని సూచించారు. ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి రూ. 1 లక్ష కోట్ల చొప్పున అందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సమావేశంలో పలు ప్రతిపాదనలు చేశారు.

రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కుల గణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను సమావేశంలో వివరించారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో 2వ దశ విస్తరణ, మూసీ నది



పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు.

దేశం ప్రగతి సాధించడానికి విద్య, వైద్యం బలమైన పునాదిగా నిలుస్తాయని ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అని, ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (రాజుజుజ్బూజ)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో ఆర్థిక స్థితిగతులు, భూమి కంటే విద్య.. సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా వెల్లడైందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు.

ఈ ప్రాధాన్యత నేపథ్యంలోనే విద్యా శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న విషయాన్ని, విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలను ప్రస్తావించారు.

"గడచిన 75 ఏండ్లలో ఉచిత విద్య అందించేందుకు అందరూ ప్రయత్నించారు. కానీ నాణ్యమైన విద్యను అందించడం ఒక సవాలుగా మారింది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టింది" అని పేర్కొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.

తెలంగాణలో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా స్కూల్స్ సందర్శిస్తే సంతోషిస్తారని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరం. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాం. టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందని అన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని గుర్తుచేస్తూ, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని దాని ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిరిసిల్ల జిల్లాలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో యూకేజీ తరగతులకు బోధకులు, ఆయాల నియామకానికి నోటిఫికేషన్ విడుదల!

## -అర్హులైన స్థానిక అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం
## -జూన్ 16 సాయంత్రం లోగా దరఖాస్తుకు ఆఖరి గడువు.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 13:

జిల్లాలోని నిరుద్యోగులకు మరియు ఉద్యోగార్థులకు విద్యాశాఖ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ విద్యా సంవత్సరం (2026-27) గాను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 48 ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా పూర్వ ప్రాథమిక తరగతుల (యూకేజీ ) నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ పాఠశాలల్లో చిన్నారి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన మరియు సంరక్షణ అందించేందుకు గాను పాఠశాలకొక ఇన్‌స్ట్రక్టర్ (బోధకులు) మరియు ఒక ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. గతంలో జూన్ 6న ఇచ్చిన ప్రకటనకు సవరణ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి (డి ఇ ఓ ) తాజా నోటిఫికేషన్ జారీ చేశారు.

# పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ.

జనగామ(భారత శక్తి)జూన్ 13:

డీజీపీ,వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ రోజు వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేర కేసుల ఫైళ్లు, రికార్డులు, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై డీజీపీ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులను సత్వరంగా స్వీకరించి పరిష్కరించడం, ప్రజా అనుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి , ఎస్సై డి పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# గూడెం గుట్ట ఆలయ అభివృద్ధికి భూమి పూజ

**-- 70 కోట్లతో అభివృద్ధి**
**-- దేవాలయాల అభివృద్ధికి రూ. 2,216 కోట్లు..**
**-- గోదావరి పుష్కరాలకు మరో రూ. వెయ్యి కోట్లు**
**-- బాసర టు భద్రాచలం ఆధ్యాత్మిక కారిడార్ రూ. 802 కోట్లతో సుందరీకరణ**

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 13 (భారతశక్తి):

ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పూర్తయిన మూడేళ్ల సందర్భంగా పిప్పిరిలో నిర్వహించిన సభలో గూడెంగుట్ట ఆలయ అభివృద్ధి పనుల ప్రస్తావన వచ్చిందన్నారు. ఆ సభ జరిగిన కొన్ని రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈరోజు భూమిపూజ నిర్వహించడం ప్రజాప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. దాదాపు రూ. 70 కోట్ల భారీ నిధులతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రాష్ట్రములోని ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 2,216 కోట్లు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. గతంలో మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు,ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్లను మంజూరు చేసిందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ. 802 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రజల నమ్మకాలను, వారి కోరికలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయానికి ప్రాణం ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందులో భాగంగా గూడెంగుట్ట పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) పనుల కోసం రూ. 74 కోట్లు కేటాయించి, ఈరోజు భూమిపూజ చేసుకోవడం శుభపరిణామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఆధ్యాత్మికత మరియు సాగునీటి రంగాల అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును భట్టి విక్రమార్క మనస్ఫూర్తిగా అభినందించారు. కేవలం అధికార హోదాను అనుభవించడం కాకుండా, నిరంతరం ప్రజల కోసం సేవ చేయడమే ప్రజాప్రతినిధి బాధ్యత అని ప్రేమ్‌సాగర్ రావు నిరూపిస్తున్నారన్నారు.



మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కూడా ప్రేమ్‌సాగర్ రావు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి పనిచేస్తున్నారని కొనియాడారు. చివరగా, గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి, రాబోయే రోజుల్లో జరిగే ప్రారంభోత్సవ మహోత్సవంలో కూడా మనమందరం ఇదే ఉత్సాహంతో పాల్గొందామని పిలుపునిచ్చారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

## మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు

ప్రొద్దుటూరు, జూన్ 13(భారత శక్తి ): ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.



శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఆర్‌డబి అతిథి గృహంలో జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కరాటే-డో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కౌటిల్ రెడ్డి ఎన్నిక.

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూన్13:



స్పోర్ట్స్ కరాటే-డో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మారంరెడ్డి కౌటిల్ రెడ్డి.. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు నాయిని సదానందం శనివారం తెలిపారు. హనుమకొండలోని ఆర్ ఈసీ సమీపంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘం సమావేశం జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ట్రేజరర్ గా నాగమహేష్, ఆర్గనైజింగ్ సెక్రటేరిగా భరత్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ గా దుర్గప్రసాద్, సలీంపాషా, చీఫ్ అడ్వైజర్ గా గౌతమ్ సందీప్ తదితరులతో కూడిన నూతన కమిటీని అధ్యక్షులు నాయిని సదానందం తెలిపారు. తమ నియామకానికి సహకరించిన వారి నమ్మకాన్ని నిలబెడతామని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహాయ సహకారాలతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కరాటే మాస్టర్ ల సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# సోలిపేట భద్రతకు దాతల సహకారం అభినందనీయం

## గ్రామ సర్పంచి - బీరవోలు వెంకటకృష్ణారెడ్డి

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 13:

ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్రామంలో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందుతుంది. ఈ నేపథ్యంలో సోలిపేట గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం త్రీమూర్తులు రూ.10,116, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు రూ.10,000 ఆర్థిక సహాయం అందించడం నిజంగా అభినందనీయం గ్రామ శ్రేయస్సు కోసం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించిన వారికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయాలి.



గ్రామ అభివృద్ధి అనేది ఒక్క గ్రామ పంచాయతీ లేదా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. గ్రామంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. నేడు కొందరు దాతలు చూపిన చొరవ రేపటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామ భద్రత కోసం ప్రారంభమైన ఈ కార్యక్రమం మరింత విజయవంతం కావాలంటే గ్రామంలోని దాతలు, మేధావులు, యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు కూడా తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉంది.

సోలిపేట గ్రామాన్ని మరింత సురక్షితంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం హృదయపూర్వకంగా ఆహ్వానిస్తోంది. గ్రామం కోసం చేసే చిన్న సహాయం కూడా గొప్ప మార్పుకు నాంది అవుతుంది. అందరూ కలిసికట్టుగా ముందుకు వస్తే సోలిపేట భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

సోలిపేట భద్రతకు దాతల సహకారం అభినందనీయం

గ్రామ సర్పంచి - బీరవోలు వెంకటకృష్ణారెడ్డి

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 13:



ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్రామంలో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందుతుంది. ఈ నేపథ్యంలో సోలిపేట గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం త్రీమూర్తులు రూ.10,116, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు రూ.10,000 ఆర్థిక సహాయం అందించడం నిజంగా అభినందనీయం గ్రామ శ్రేయస్సు కోసం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించిన వారికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయాలి. గ్రామ అభివృద్ధి అనేది ఒక్క గ్రామ పంచాయతీ లేదా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. గ్రామంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. నేడు కొందరు దాతలు చూపిన చొరవ రేపటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామ భద్రత కోసం ప్రారంభమైన ఈ కార్యక్రమం మరింత విజయవంతం కావాలంటే గ్రామంలోని దాతలు, మేధావులు, యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు కూడా తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. సోలిపేట గ్రామాన్ని మరింత సురక్షితంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం హృదయపూర్వకంగా ఆహ్వానిస్తోంది. గ్రామం కోసం చేసే చిన్న సహాయం కూడా గొప్ప మార్పుకు నాంది అవుతుంది. అందరూ కలిసికట్టుగా ముందుకు వస్తే సోలిపేట భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

# మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 1 3(భారత శక్తి) జిల్లాలో శనివారం నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమావేశమై జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy